

నందినగర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఈఈ(సివిల్) పరీక్ష అభ్యర్థులు

# ఏఈఈ తుదిజాబితాను ప్రకటించాలి

- ప్రభుత్వానికి డిమాండ్ చేసిన కేటీఆర్
- అభ్యర్థుల ఆందోళనను గుర్తించాలని టీజీపీఎస్సీ చైర్మన్‌కు వినతి
- సర్కార్‌పై ఒత్తిడి తెస్తామని అభ్యర్థులకు భరోసా

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన ఏఈఈ (సివిల్) పరీక్ష అభ్యర్థుల ఎంపిక జాబితాను ప్రకటించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 1180 పోస్టుల తుదిజాబితా కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు బుధవారం నందినగర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. జాబితాను వెంటనే ప్రకటించేలా ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకురావాలని కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగాలకు ఎన్నికైన జాబితాను ఇప్పటివరకు వెల్లడించకుండా ఆలస్యం చేస్తుందని ప్రభుత్వంపై మండిపడ్డారు. 22 నెలల క్రితమే నోటిఫికేషన్ విడుదలైై, పరీక్ష, సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా గతేడాది సెప్టెంబర్ నాటికే పూర్తి అయ్యిందని వెల్లడించారు. ఎన్నికల కోడ్ కారణంగా అభ్యర్థుల తుదిజాబితా నిలిచిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు తుది జాబితాను విడుదల చేయకపోవడంపై మండిపడ్డారు. దీంతో అభ్యర్థులు తీవ్ర గందరగోళంలో ఉన్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. అభ్యర్థులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ విషయమై టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. వెంటనే ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.



కోటపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు అందజేసిన చెల్లని చెక్కు

# చెల్లని కల్యాణలక్ష్మి చెక్కు

- గడువు ముగిసిన చెక్కు అందజేత
- చెల్లదన్న బ్యాంకు అధికారులు

కోటపల్లి, జూలై 3 : కల్యాణ లక్ష్మి పథకం లబ్ధిదారుకు అధికారులు చెల్లని చెక్కు ఇచ్చిన ఘటన మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలో బుధవారం జరిగింది. మండలంలోని ఎదుల్లబంధం గ్రామానికి చెందిన జైనేని సరిత-శ్రీనివాస్ దంపతుల కూతురు మేఘన వివాహం 2023 ఫిబ్రవరి 23న జరిగింది. కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోగా.. సరిత పేరిట 2024 ఏప్రిల్ 3న రూ.1,00,116కు సంబంధించిన చెక్కు మంజూరైంది. ఆ చెక్కును లబ్ధిదారుకు వెంటనే ఇవ్వకుండా మూడు నెలల తర్వాత బుధవారం కార్యాలయానికి పిలిపించుకొని మేఘన తల్లి సరితకు అందజేశారు. చెక్కును మార్చుకునేందుకు బ్యాంకుకు వెళ్లిన సరిత సిబ్బందికి అందజేయగా, బుధవారంతో చెక్కు గడువు ముగిసిందని వారు తిప్పి పంపించారు. కల్యాణ లక్ష్మి చెక్కు వచ్చి మూడు నెలలవుతున్నా అధికారులు చెప్పలేదని, బుధవారం ఫోన్ చేసి చెల్లని చెక్కు ఇచ్చారని లబ్ధిదారు సరిత, ఆమె కూతురు మేఘన ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

# జిల్లాల్లోనూ వన మహోత్సవం

- ఖమ్మం, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో ప్రారంభం
- నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా అమలు




ఖమ్మం జిల్లా గొల్లగూడెంలో మొక్క నాటుతున్న మంత్రులు సురేఖ, పొంగులేటి

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): ఎట్టకేలకు జిల్లాల్లోనూ వన మహోత్సవం ప్రారంభమైంది. ఇటీవల వరంగల్ జిల్లాలో వన మహోత్సవం లోగోను ఆవిష్కరించి, మొక్క నాటి సీఎం రేవంత్‌రెడ్డి అధికారికంగా కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి ప్రారంభించినా క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేయకపోవడంతో 'నమస్తే తెలంగాణ'లో 'అయోమయంగా వన మహోత్సవం' శీర్షికన సోమవారం కథనం ప్రచురితమైంది. దీనికి ప్రభుత్వం స్పందించి బుధవారం పెద్దపల్లి, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి డివిజన్ లంకపల్లిలోని గొల్లగూడెం గ్రామంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ వన మహోత్సవం కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ ఏడాది వన మహోత్సవంలో ఖమ్మం జిల్లాలో 31లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. మొదటి విడతలో భాగంగా 20 హెక్టార్లలో 33వేల మొక్కలు నాటాలని నిర్ణయించారు. విద్యార్థులు, యువతతో కలిసి వివిధ జాతులకు చెందిన 400 రకాల మొక్కలను మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నాటారు. పెద్దపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి మొక్కలు నాటి కార్యక్రమం ప్రారంభించారు. కరీంనగర్, పెద్దపల్లి, గోదావరిఖని ప్రాంతాల్లో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో రావి, వెదురు, యేగిస, మర్రి, నేరేడు, ఎర్ర మద్ది, ఉసిరి, చింత, వేప వంటి తదితర 20.25 కోట్ల మొక్కలను ఈ సీజన్‌లో నాటనున్నారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో అటవీశాఖ ప్రధాన కార్యదర్శి నదీమ్ అహ్మద్, కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్, ఖమ్మం జిల్లా డీఎఫ్‌వో సిద్దార్థ్ విక్రమ్‌సింగ్ ఇతర అధికారులు పాల్గొన్నారు. గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు అటవీశాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ సర్పంచ్‌లు

# పెండింగ్ బిల్లులపై అసెంబ్లీలో నిలదీయండి

- సఫాయి కార్మికుల జీతాలపైనా ప్రశ్నించండి
- కేటీఆర్‌కు రాష్ట్ర సర్పంచుల సంఘం వినతి

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం కోరింది. గ్రామాల్లోని పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు తక్షణం ఇచ్చేలా అసెంబ్లీలో గళాన్ని వినిపించాలని విజ్ఞప్తి చేసింది. బుధవారం బంజారాహిల్స్ నందినగర్‌లోని నివాసంలో కేటీఆర్‌ను కలిసి రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో చేపట్టిన పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని గుర్తుచేశారు. నేడు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏడు నెల్లో నయా పైసా కూడా పల్లె, పట్టణాలకు విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. పెండింగ్ బిల్లులపై గవర్నర్‌కు మొరపెట్టుకున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి చలనమూ లేదని మండిపడ్డారు. సఫాయి కార్మికులకు ఏడు నెలలుగా జీతాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు బొజ్జ రాజేశ్వర్‌రెడ్డి, యాదిరెడ్డి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయం వైపు నిలబడండి



- ప్రొఫెసర్ కోదండరాంకు దాసోజు శ్రవణ్ లేఖ

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీగా నామినేట్ కావటానికి తన న్యాయపోరాటంలో అడ్డురావొద్దని, తనకు సహకరించాలని ప్రొఫెసర్ కోదండరాంకు బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. బుధవారం కోదండరాంకు బహిరంగ లేఖ రాశారు. 'వెనుకబడిన వర్గాల హక్కులను కాలరాయాలని రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తుంటే, సహకరించాలని మీకు మనసు ఎలా వచ్చింది? నాలాంటి వెనుకబడ్డ వారికి రాజకీయ అవకాశాలు రావు. వచ్చినా డబ్బు సంచులతో మమ్మల్ని ఓడగొడతారు. నేను కేసీఆర్ ఇచ్చిన అవకాశాన్ని వదులుకోదల్చుకోలేదు. నా న్యాయ పోరాటానికి మద్దతు ఇవ్వండి. ఎమ్మెల్సీగా నేను నియామకం పొందే వరకు తోడ్పాటును అందించాలి' అని లేఖలో కోరారు. ఉద్యమ వ్యతిరేకి అయిన రేవంత్.. లీగల్ లిటిగేషన్‌లో తమను ఇరికించి పరోక్షంగా అవమానిస్తున్న విషయం బోధపడటం లేదా? అని ప్రశ్నించారు. 'మీకు కచ్చితంగా పదవి దక్కాలి. రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత ఉంటే.. రాజ్యసభకు పంపించి ఉండొచ్చు. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా నియమించి ఉండొచ్చు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించి, ఆర్నెల్లలోపు ఎమ్మెల్సీగా నియమించి ఉండొచ్చు. ఎమ్మెల్సీ నియామకాలు వచ్చే వరకు మంత్రిగా కొనసాగించి ఉండొచ్చు కదా' అని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో పోలీసుల ప్రాణాలకే రక్షణ కరువు

- బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్‌కు పరామర్శ



హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో పోలీసుల ప్రాణాలకే రక్షణ లేకుండా పోయిందని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఖమ్మం జిల్లా అశ్వారావుపేటలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్‌ను బుధవారం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో హోంమంత్రి లేడని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలనపై ఇంట్రెస్ట్ లేదని పేర్కొన్నారు. పోలీసుల ప్రాణాలకే రక్షణ లేకపోతే, ఇక ప్రజలకు ఏం రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. దళిత ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్‌పై కేస్ డైరీ విసిరేసి సీఐ జితేందర్‌రెడ్డి తీవ్రంగా వేధించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేయడం బాధాకరమన్నారు. ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నా ఏ ఒక్కరూ శ్రీనివాస్‌ను పరామర్శించకపోవడం దారుణమని పేర్కొన్నారు.

# నేతన్నది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

- 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు వైఫల్యం వల్లనే సిరిసిల్లలో మరో చేనేత కార్మికుడు బలయ్యాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఉపాధి లేక ఉరి వేసుకుని పల్లె యాదగిరి అనే కార్మికుడు ఆత్మహత్య చేసుకోవడంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. అది ఆత్మహత్య కాదని, ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్యేనని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో చేనేత రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేనేతకు అందించిన చేయూతను అర్ధాంతరంగా నిలిపివేయడంతోనే ఈ రంగంలో మరణమృదంగం మోగుతున్నదని ధ్వజమెత్తారు. ఆత్మహత్య చేసుకున్న పల్లె యాదగిరి కుటుంబాన్ని ఆదుకోవడానికి వెంటనే రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## కేసీఆర్ పదేండ్ల పాలన
# తెలంగాణకు స్వర్ణయుగం

- తెలంగాణ ప్రగతికి కేంద్రం సహకరించాలి
- విభజన సమస్యలను పరిష్కరించాలి
- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): దశాబ్దాలపాటు దగాపడ్డ తెలంగాణను రాష్ట్రంగా సాధించి పదేండ్లపాటు కేసీఆర్ అద్భుతంగా పాలించారని, ఒక రకంగా అది తెలంగాణకు స్వర్ణయుగమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. విభజన హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి నివేదించినా ఫలితం లేకుండా పోయిందని, కనీసం ఇప్పటికైనా వాటిని తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పట్టింపులకుపోయి తెలంగాణ ప్రగతిని నిరోధించకూడదని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చపై ఆయన బుధవారం రాజ్యసభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని, కేసీఆర్ పాలనలో తెలంగాణలో జరిగిన అభివృద్ధిని వివరించారు. తెలంగాణ విజయవంతంగా అమలు చేసిన రైతుబంధు పథకం స్ఫూర్తితో ప్రధాని నరేంద్రమోదీ కిసాన్ సమ్మాన్ నిధిని దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టారని అది తెలంగాణకు ఎంతో గర్వకారణమని తమ నాయకుడు కేసీఆర్ పేర్కొన్న సందర్భాలను ఆయన గుర్తుచేశారు. తమ రాష్ట్రంలో చేపట్టిన మిషన్ భగీరథ దేశానికి 'హర్ ఘర్ కీ జల్' పథకానికి స్ఫూర్తిగా నిలిచిందని చెప్పారు. సాగునీటి రంగంలో కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచ ఇంజినీరింగ్ అద్భుతాల్లో ఒకటి అని కొనియాడారు. ఐటీ రంగంలో దేశమే గర్వపడేరీతిలో తెలంగాణ అనేక విజయాలు సాధించిందని చెప్పారు. సంక్షోభంలో ఉన్న విద్యుత్ రంగాన్ని కేసీఆర్ దార్శనిక విధానాలతో నిర్ణయాలు తీసుకోవటం వల్ల పారిశ్రామిక రంగం కొత్తపుంతలు తొక్కిందని తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన అమెజాన్, గూగుల్, ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్, యాపిల్ వంటి అనేక కంపెనీల గమ్యస్థానం హైదరాబాద్‌ను ఎంచుకున్నాయని వివరించారు. 2014లో రూ.66,276కోట్లు ఉన్న ఐటీ ఎగుమతులు 2023 నాటికి రూ.2,41, 275కోట్లకు చేరటమే అందుకు నిదర్శనమని తెలిపారు. కేసీఆర్ పాలనలో తలసరి ఆదాయం, తలసరి విద్యుత్ వినియోగాన్ని పరిశీలిస్తే తెలంగాణ ఎక్కడి నుంచి ఎక్కడికి చేరిందో తెలుస్తుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులుగా తాము తెలంగాణ ప్రాంత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు పోరాటం చేస్తున్న సందర్భాలను ఆయన గుర్తుచేశారు. కనీసం ఈ టర్మ్‌లోనైనా విభజన హామీలను మోదీ అమలు చేయాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ ప్రాజెక్టు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం సహా తెలంగాణకు విభజన హామీల్లో భాగమైన ఐఐఎంను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



సీఎం రేవంత్‌రెడ్డితో నిందితుడు కూరపాటి కిశోర్ (ఫైల్)



ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, బీఆర్ఎస్ నాయకుడు కొండబాల కోటేశ్వరరావుకు ఘటన వివరాలు చెబుతున్న ప్రభాకర్ కుటుంబ సభ్యులు

# ఇంత జరిగినా కనికరించదా?

మొదటిపేజీ తరువాయి...

డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, జిల్లా నాయకులు లక్ష్మణ్ తదితరులు ప్రభాకర్ కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా తన కొడుకు ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులు, తమ 7.10 ఎకరాల్లో మూడెకరాలను గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు చెరువులో కలిపిన తీరును ప్రభాకర్ తండ్రి వీరభద్రయ్య వివరించారు. కొడుకు మృతితో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నామని, 70ఏండ్ల వయస్సులో దివ్యాంగుడినైన తాను కుటుంబపోషణ కోసం ఏ పనీ చేయలేనని, ప్రభుత్వమే న్యాయం చేయాలని వేడుకున్నారు. ప్రభాకర్ కష్టపడి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న సమయంలో తమ పొలాన్ని కొందరు కక్షపూరితంగా చెరువులో కలపడం దారుణమని, ఈ విషయంపై కలతచెంది తన కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనలేదని, ప్రభాకర్‌కు ఇద్దరు చిన్నపిల్లలున్నారని, కోడలు సైతం ఏమీ చేయలేని పరిస్థితిలో ఉందని చెప్పారు. తన కొడుకు మరణానికి కారకులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తనకు జరిగిన అన్యాయంపై ప్రభాకర్ వీడియో ద్వారా చెప్పే ప్రయత్నం చేస్తే, అన్యాయంపై కాకుండా వీడియోపై రాద్ధాంతం చేయడం తమ కుటుంబాన్ని మరింత బాధపెడుతున్నదని ఆవేదన వ్యక్తంచేశాడు. ప్రభాకర్ కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని తమ ఎమ్మెల్యే, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు విజ్ఞప్తిచేశారు. ఆత్మహత్యకు కారకులైన కిశోర్ వంటి నాయకులను తప్పిస్తే ప్రభాకర్ ఆత్మ క్షోభిస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభాకర్ ఆత్మహత్యపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారని, రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా డిమాండ్ చేయడం తమ కుటుంబానికి కొంత ఊరట కలిగించేదిగా ఉందని చెప్పారు.

### ప్రభాకర్ మృతిపై సమగ్ర విచారణ

రైతు ప్రభాకర్ ఆత్మహత్యపై సమగ్ర విచారణ కొనసాగుతున్నదని, ఈ ఘటన చాలా బాధ కలిగించిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు.

### చింతకాని తహసీల్దార్ ఘెరావ్

చింతకాని తహసీల్దార్ రమేశ్‌ను రైతు ప్రభాకర్ కుటుంబసభ్యులు బుధవారం ఘెరావ్ చేశారు. ప్రభాకర్ పొలం పరిశీలనకు తహసీల్దార్ తన కార్యాలయ సిబ్బంది, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల బృందంతో కలిసి వెళ్లగా కుటుంబసభ్యులు అక్కడికి చేరుకొని తమకు న్యాయం చేయాలని పట్టుబట్టారు. గతంలో వినతిపత్రం ఇచ్చినా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. తహసీల్దార్ రమేశ్ మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని, పొలం హద్దులను త్వరలో కల్పిస్తామని తెలిపారు.

## వరంగల్ నగరంపైనా
# పొంగులేటికే పెత్తనం

- ఇటీవలి సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- 20 రోజులకో సమీక్ష పెట్టాలని సూచన
- ఉమ్మడి జిల్లాలో మంత్రులుగా సురేఖ, సీతక్క
- సీఎం ఆదేశాలపై మంత్రి సురేఖ తీవ్ర అసంతృప్తి
- నగర పరిధిలోనే సురేఖ నియోజకవర్గం
- అక్కడా పొంగులేటి నిర్ణయాలా? అంటూ ఆగ్రహం

వరంగల్, జూలై 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజా నిర్ణయంపై ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మంత్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలోనే ప్రాధాన్యత ఉండటంలేదని ఇన్ని రోజులు అసంతృప్తితో ఉన్న వీరు ఇప్పుడు జిల్లాల్లో, ఇంకా ముఖ్యంగా సొంత నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూన్ 29న వరంగల్ నగర పర్యటనకు వచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. వరంగల్ నగర అభివృద్ధిపై ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. స్మార్ట్‌సిటీ, మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్‌రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అంశాలపై చర్చించారు. హైదరాబాద్‌తో సమానంగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. వరంగల్ నగర అభివృద్ధిపై ఉమ్మడి వరంగల్ ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇరవై రోజులకోసారి సమీక్ష నిర్వహిస్తారని సీఎం చెప్పారు. 45 రోజుల్లో తాను మరోసారి సమీక్ష నిర్వహిస్తానని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, సీతక్క కూడా ఉన్నారు. వరంగల్ నగర అభివృద్ధిపై సమీక్షల బాధ్యతను వీరిద్దరికిగానీ, వీరిలో ఒకరికిగానీ అప్పగించకుండా ఇన్‌చార్జి మంత్రికి అప్పగించడంపై సమావేశంలో ఉన్న ఇతర ప్రజాప్రతినిధులు చర్చించుకున్నారు. వరంగల్ నగర అభివృద్ధిపై సమీక్షల బాధ్యతను ఇతర జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటికి అప్పగించడంపై స్థానిక మంత్రులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. వరంగల్ నగర అభివృద్ధిపై ఇన్‌చార్జి మంత్రి సమీక్షించాలనే నిర్ణయంపై మంత్రి సురేఖతోపాటు నగర పరిధిలోని ఇతర ఎమ్మెల్యేలు అసంతృప్తిగానే ఉన్నారు. వరంగల్ పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, కడియం శ్రీహరి సైతం అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వ పరంగా తీసుకునే విధాన నిర్ణయాలు, భారీ స్థాయిలో చేపట్టే పనులు, మాస్టర్ ప్లాన్ ఆమోదం వంటి వాటిపై ప్రభుత్వ స్థాయిలో పర్యవేక్షణ చేస్తే బాగుంటుందిగానీ.. అన్ని పనులను ఇన్‌చార్జి మంత్రి పర్యవేక్షించడం సరికాదని అంటున్నారు. గతంలోనూ ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులు ఉండేవారని.. ప్రత్యేక అభివృద్ధి నిధుల మంజూరు, రాజకీయ పదవుల కేటాయింపు, సొంత పార్టీ ఎమ్మెల్యేల మధ్య సమన్వయం కోసం వీరు పని చేసేవారని గుర్తుచేస్తున్నారు.

### పొంగులేటి పెత్తనం సరికాదు!

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పనులపై ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్షించాలనే సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయంపై స్థానిక మంత్రి కొండా సురేఖ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. తన నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాలపై మరో జిల్లా మంత్రి పెత్తనం సరికాదని అంటున్నట్టు సమాచారం. ఉమ్మడి జిల్లా వ్యవహారాలను జిల్లా ఇన్‌చార్జి పొంగులేటి పర్యవేక్షిస్తున్నారని, తమ నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపైనా తమకు అధికారం లేకుంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి కాంగ్రెస్‌లో చేరికపైనా మంత్రి సురేఖకు, ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మధ్య విబేధాలు నెలకొన్నాయి. తన నియోజకవర్గానికి చెందిన గుండు సుధారాణిని తనకు సమాచారం లేకుండానే కాంగ్రెస్‌లో చేర్పించేలా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి వ్యవహరించడంపై అప్పట్లోనే సురేఖ అసంతృప్తి వ్యక్తంచేశారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ పరిణామం జరిగింది. అప్పటినుంచి ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి, జిల్లా మంత్రి సురేఖ మధ్య అంతరం పెరిగినట్టు సమాచారం.

# టీజీపీఎస్సీ ముట్టడికి సంపూర్ణ మద్దతు

- కాంగ్రెస్ సర్కారుకు నిరుద్యోగులే బుద్ధి చెబుతారు
- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్



ఖైరతాబాద్, జూలై 3: నోటిఫికేషన్లు, ఉద్యోగాల భర్తీలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ ఈ నెల 5న నిరుద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న టీజీపీఎస్సీ ముట్టడికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని, బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు, విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ గౌరవ అధ్యక్షుడు రాజారాం యాదవ్ పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, భృతి ఇస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా ఇంతవరకు ఉద్యోగాల ఊసే ఎత్తడం లేదని వాపోయారు. ఓయూ విద్యార్థి మోతీలాల్‌నాయక్ వారం రోజులుగా ఆమరణ దీక్ష చేపట్టినా ప్రభుత్వంలో చలనం లేదని ఆరోపించారు. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా గ్రూప్-2లో 2వేలు, గ్రూప్-3లో మూడు వేల ఉద్యోగాలను కలుపాలని, అలాగే గ్రూప్-1లో 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను మెయిన్‌కు ఎంపిక చేయాలన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 25వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, ఆయా డిమాండ్లను పరిష్కరించుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులే గద్దె దించుతారని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో గిరిజన రిజర్వేషన్ల సాధన సమితి, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్, హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్, బీసీ సంఘం మహిళా అధ్యక్షురాలు, న్యాయవాది శారదాగౌడ్, విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొంపెల్లి రాజు, తెలంగాణ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేకల కృష్ణ, బీసీ న్యాయవాదుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లొడంగి గోవర్ధన్, ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అశోక్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ నాయకుడు నరహరి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధుల గౌరవ వేతనాలు పెండింగ్

- పదవీకాలం ముగిసినా చెల్లించని ప్రభుత్వం
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచే వేతనాలు బంద్

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం తమకు గౌరవ వేతనాలు కూడా చెల్లించడంలేదని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గౌరవ వేతనాల చెల్లింపులు బంద్ అయ్యాయని ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులకు చెల్లించాల్సిన గౌరవవేతనాలు రూ.100 కోట్లకు పైనే ఉంటాయని చెప్తున్నారు. సర్పంచ్‌లు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ), మండల ప్రాదేశిక సభ్యులు (ఎంపీటీసీ), జిల్లా ప్రాదేశిక సభ్యులు (జడ్పీటీసీ సభ్యులు) గౌరవ వేతనాలు చెల్లించడంలేదని, తమ పదవీ కాలం కూడా పూర్తయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలకు నెలకు రూ.13 వేల చొప్పున చెల్లిస్తున్నారు. రాష్ట్రంలో ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు 539 మంది చొప్పున ఉన్నారు. ఎంపీటీసీలు 5,817 మంది, సర్పంచ్‌లు 12,769 మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.6,500 చొప్పున ఇస్తున్నారు. ఈ మొత్తాన్ని నేరుగా వారి అకౌంట్లో జమ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల వేతనాలకు నిధులు విడుదల చేయలేదు. ఇటీవల పదవీకాలం ముగిసిన సందర్భంగా చేస్తున్న సన్మానాల కార్యక్రమంలో తమకు గౌరవ వేతనాలు ఇప్పించాలని కార్యక్రమానికి హాజరవుతున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను వేడుకుంటున్నారు.